epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 304 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 12, జులై 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131



## ఢిల్లీలో భూప్రకంపనలు..
# ఈ వారంలో రెండోసారి

- హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం
- రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు
- ఝుజ్జర్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తింపు

దేశ రాజధాని న్యూఢిల్లీలో శుక్రవారం సాయంత్రం భూకంప ప్రకంపనలు సంభవించాయి. సాయంత్రం ఏడు గంటల సమయంలో హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం సంభవించడంతో ఢిల్లీలో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఝుజ్జర్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రెండు రోజుల వ్యవధిలో

తరువాయి 2లో

## వందలాది మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లకు
# ట్రంప్ ప్రభుత్వం షాక్!

- తొలగించేందుకు అమెరికా సిద్ధం
- తొలగింపు జాబితాలో 1107 మంది సివిల్ సర్వెంట్లు, 246 మంది దౌత్యవేత్తలు
- లేఆఫ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడి

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వందల సంఖ్యలో ఉన్నతాధికారులను తొల గించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ తొలగింపు జాబితాలో 1,107 మంది సివిల్ సర్వెంట్లు, స్థానికంగా పనిచేస్తున్న 246 మంది దౌత్యవేత్తలు ఉన్నారని సమాచారం. సంబంధిత వర్గాల సమాచారం మేరకు, వీరికి లేఆఫ్ నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. నోటీసులు అందుకున్న దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు 120 రోజుల పాటు సెలవుల్లో ఉంటారని, ఆ తర్వాత వారిని అధికారికంగా ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. అయితే, వీరిలో ఎక్కువ మందికి 60 రోజుల సమయం మాత్రమే ఇచ్చినట్లు సమాచారం.

తరువాయి 2లో





## అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు
# హాజరైన సీఎం రేవంత్

- తాజ్ కృష్ణ హోటల్‌లో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు
- కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్‌తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి
- భారత్-అమెరికా మధ్య సంబంధాలు క్రమంగా పెరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్ కృష్ణ హోటల్‌లో 249వ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం,

తరువాయి 2లో

## గోదావరికి భారీగా వరద నీరు..
# కంట్రోల్ రూం నెంబర్లు ఇవే..!

- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షా లు
- గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం
- అలర్ట్ జారీ చేసిన ఏపీఎస్‌డీఎంఏ

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండి ప్రఖర్

తరువాయి 2లో



## తెలంగాణలో ఈ నెల 14న
# కొత్త రేషన్ కార్డుల పంపిణీ!

- తుంగతుర్తిలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- 94,72,422కు చేరనున్న రేషన్ కార్డుల సంఖ్య

తెలంగాణ రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 14న తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా కొత్త రేషన్

తరువాయి 2లో




## ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని ఆ సినిమాలో చూపించారు: సీఎం చంద్రబాబు

ప్రపంచ జనాభా దినోత్సవంపై అమరావతిలో సమ్మిట్ 2లో

# పన్ను ఎగవేతలు అడ్డుకోవడానికి టెక్నాలజీ ఉపయోగించండి



- అమరావతిలో కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం
- దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు
- జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్ మోడల్ లా ఉండాలని ఆకాంక్ష

ఏపీ సీఎం చంద్రబాబు నేడు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్ను ఎగవేతలను అడ్డుకోవడానికి టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. అందుకోసం డేటా అనలిటిక్స్ సాయం తీసుకోవాలని అన్నారు.

**చంద్రబాబు అధికారులకు చేసిన సూచనలు...**

* సమర్థవంతమైన పన్ను వసూళ్ల విధానం ద్వారా జాతీయ సంపదను పెంచాలి. ఆ సంపదను ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వినియోగించాలి
* జీఎస్టీ వసూళ్లలో ఏపీ దేశానికే రోల్ మోడల్ లా ఉండాలి
* జీఎస్టీకి సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా యాక్షన్ ప్లాన్ ఉండాలి
* జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర అధికారుల

తరువాయి 2లో

## ఐదు దేశాల పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

మధ్య సమాచార సమన్వయం ఉండాలి

ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి

ఏపీలో ఎక్కడా పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలి

జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి

## వందలాది మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లకు ట్రంప్ ప్రభుత్వం షాక్!

(మొదటిపేజీ తరువాయి)

శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దౌత్య ప్రాధాన్యతలపై దృష్టి సారించామని తాజా నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో పాటు వారి మిత్రపక్షాలు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తున్నాయి. అయితే, ప్రస్తుత మరియు మాజీ దౌత్యవేత్తలు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ చర్యల వలన విదేశాల్లో ఇప్పటికే ఉన్న ముప్పుతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం బలహీనపడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల కోతలను నిలిపివేయాలని కోరుతూ అమెరికన్ ఫారెన్ సర్వీసెస్ అసోసియేషన్ గత నెలలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విదేశీ సేవలు అందించే ఈ విభాగానికి అంతరాయం కలిగించడం జాతీయ ప్రయోజనాలను ప్రమాదంలో పడేస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్లపై దీని ప్రభావం పడుతుందని సంస్థ అధ్యక్షుడు టామ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా మధ్య దౌత్య సంబంధాలు 1947లో ప్రారంభమై నేటి వరకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, సాంకేతిక రంగాల్లో మరింత దృఢంగా మారాయని అన్నారు. ఈ వేడుకలో భారత్ అమెరికా స్నేహ సంబంధాలను గుర్తు చేస్తూ, రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో భూప్రకంపనలు..ఈ వారంలో రెండోసారి

(మొదటిపేజీ తరువాయి)

హర్యానాలో ఇది రెండో భూకంపం. ఈ భూకంపం దాటికి ఢిల్లీతో పాటు సమీప ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.రాత్రి 7.49 గంటలకు భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. హర్యానాలోని రోహ్తక్, బహదూర్‌గఢ్ జిల్లాల్లో కూడా ప్రకంపనలు సంభవించాయి. నిన్న ఉదయం ఝజ్జర్‌లో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. నిన్న కూడా ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.

## తెలంగాణలో ఈ నెల 14న కొత్త రేషన్ కార్డుల పంపిణీ!

(మొదటిపేజీ తరువాయి)

కార్డుల జారీ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఇదివరకే కొంతమందికి రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. దీని ద్వారా దాదాపు 11.30 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. గత ఆరు నెలల కాలంలో ప్రభుత్వం 41 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసింది. తాజాగా పంపిణీ చేయనున్న వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422కు చేరుకుంటుంది. వీటి ద్వారా మొత్తం 3.14 కోట్ల మందికి ప్రయోజనం కలగనుంది.

## తలసేమియాపై అవగాహన..
### ఈనెల 19న విశాఖ ఆర్కే బీచ్‌లో రన్

విశాఖ: తలసేమియాపై అవగాహన కోసం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో 10కె, 5కె, 3కె రన్ నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేతృత్వంలో ఈనెల 19న సాయంత్రం ఈ కార్యక్రమం జరగనుంది. రన్‌లో ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరి పాల్గొననున్నారు. రన్ తర్వాత తమన్, సమీరా భరద్వాజ్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. రన్‌లో పాల్గొనేవారు www.thalassemiarun.comలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు.



## గోదావరికి భారీగా వరద నీరు..
# కంట్రోల్ రూం నెంబర్లు ఇవే..!

(మొదటిపేజీ తరువాయి)

జైన్ శుక్రవారం వెల్లడించారు. నదిలో నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.2 అడుగులకు చేరుకుందని ప్రఖర్ జైన్ తెలిపారు. అదేవిధంగా, ధవళేశ్వరం వద్ద ప్రస్తుతానికి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2.9 లక్షల క్యూసెక్కులుగా నమోదైందని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో, దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. వరద పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, కొన్ని కీలక సూచనలను ఏపీఎస్‌డీఎంఏ జారీ చేసింది. బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించవద్దని స్పష్టం చేసింది. అలాగే, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం వంటివి పూర్తిగా నివారించాలని హెచ్చరించింది. స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని, ప్రజలు వారి సూచనలను తప్పక పాటించాలని ప్రఖర్ జైన్ కోరారు.

## ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని
# ఆ సినిమాలో చూపించారు: సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

**హాజరైన సీఎం చంద్రబాబు**

**జనాభా పెరగాలని పిలుపు**

దేశానికి బలమైన ఆర్థికవనరు జనాభేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జనాభా పెరుగుదలకు త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని అన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ అప్పారావు స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాడు ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారని, ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని అందులో చూపించారని వివరించారు. పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చాడని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర సచివాలయం వద్ద ప్రపంచ జనాభా దినోత్సవంపై మొదటి అమరావతి సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనాభా నిర్వహణా విధానం ప్రతి కుటుంబం ముఖ్యంమీ అభిప్రాయం మార్గదర్శనం అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన సర్వేను సీఎం ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రత్యుత్పత్తి రేటు పెరగాలి**

ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేది. 2004కు ముందు సీఎంగా ఉన్నప్పుడు జనాభా నియంత్రణకు ప్రోత్సాహకాలు ఇచ్చాను. ఇద్దరు పిల్లల కంటే ఎక్కుమంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చేస్తూ చట్టాన్ని తెచ్చాను. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. దేశం అంటే రాష్ట్రాలు, ప్రాంతాలు, పట్టణాలు, సరిహద్దులు, భూభాగాలు మాత్రమే కాదు, దేశం అంటే మనుషులు.

**మన బలం మానవ వనరులు**

ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 ఏళ్ల వయసు ఉన్నవారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు...అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థితి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా



మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనాను కూడా వెనక్కు నెట్టింది.

*** యువశక్తి తగ్గి... వృద్ధులు పెరుగుతున్నారు**

ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేట్ నిలిచిపోతుంది. భవిష్యత్‌లోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో 1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది.

*** పిల్లలను కనేవారికి విదేశాల్లో ప్రోత్సాహకాలు**

జపాన్‌లో పిల్లలు స్కూలుకు వెళ్లే వరకు చైల్డ్ కేర్ సేవలను అందించడంతో పాటు పిల్లల చదువుకు ఆర్థిక సాయం లేదా ఉచిత విద్యను అందిస్తున్నారు. ఎక్కువమంది పిల్లలుంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంతో పాటు తక్కువ రెంట్‌తో ఇల్లు అద్దెకు ఇస్తున్నారు. దక్షిణ కొరియా దేశంలో నెలవారీగా ప్రత్యక్ష నగదు బహుమతులు అందించడంతోపాటు వివాహం, కాన్పులకు, ఐవీఎఫ్ గర్భధారణకు సాయం చేస్తున్నారు. సింగపూర్ దేశంలో బేబీ బోనస్ స్కీమ్ కింద పుట్టిన ప్రతి శిశువు కోసం కొంత నగదు అందిస్తున్నారు. మ్యాచ్ సేవింగ్స్ కింద ప్రభుత్వ సొమ్మును జోడించి పిల్లల ఖాతాల్లో వేస్తున్నారు. రష్యాలో రెండవ బిడ్డను కంటే ఫ్రీ హెల్త్‌కేర్ కింద గర్భిణీలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. హంగేరీలో నలుగురు కంటే ఎక్కువ పిల్లులు ఉన్న వారికి జీవితాంతం ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. చైనాలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నారు.

*** ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడం లేదు**

జనాభా తగ్గిపోతే వృద్ధి రేటు పడిపోతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదలపై సమావేశంలో పోల్ నిర్వహిస్తే ఇద్దరు పిల్లలుండాలని 67.41 శాతం మంది, ఒకరే ఉండాలని 12.34 శాతం మంది, ముగ్గురు పిల్లలుండాలని 19.88 శాతం మంది అభిప్రాయపడ్డారని వివరించారు. పిల్లలను కనడానికి యువత ఆస్తకి చూపడం లేదని, చాలా మంది భార్యాభర్తలు పిల్లలను వద్దనుకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఖర్చులు పెరుగుతాయని పిల్నల్లి కనడానికి ఇష్టపడటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

*** ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి... రానురాను అవి కనుమరుగవుతున్నాయి. గత కొన్నేళ్ల వరకు ఇంట్లో ప్రతి ఒక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇచ్చేవాళ్లం. ఐదుగురు ఉంటే 25 కేజీలు ఇచ్చేవాళ్లం. అంతకంటే ఎక్కువమంది ఉంటే బియ్యం ఇచ్చేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక కుటుంబంలో పది మంది ఉన్నా 50 కేజీల కంటే ఎక్కువ ఇచ్చేదానిపై ఆలోచిస్తున్నాం. దక్షిణ భారత దేశంలో జనాభా తగ్గిపోతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో పార్లమెంటు సీట్లు పెరుగుతాయి.. కానీ దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలకు సీట్లు తగ్గిపోతాయని కొందరు ఆందోళన చెందుతున్నారు... అని చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది: మంత్రి నారా లోకేశ్

- **ఏపీ వ్యాప్తంగా నిన్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0**
- **అందరికీ కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**
- **ఇలాంటి కార్యక్రమాలో విద్యార్థుల భవితకు బంగారు బాట వేయొచ్చని వెల్లడి**

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. సమాజం స్వచ్ఛందంగా



అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఏడాదిన్నరలో రూ.50వేల కోట్ల పెట్టుబడులు

* **లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 60వేల మందికి ఉపాధి**
* **2024- 25 లో రూ.66వేల కోట్ల ఉత్పత్తులు ఎగుమతి**
* **రూ.లక్ష కోట్ల పెట్టుబడితో దీర్ఘకాలిక వ్యూహం**
* **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.**

హైదరాబద్ జులై,,11 (సమయం న్యూస్) : తెలంగాణ ను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్" మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, ఆ క్రమంలోనే కేవలం ఏడాదిన్నరలో రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫలితంగా కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్ లో "ఈటీ ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్" రెండో ఎడిషన్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. "202425లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసింది. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. దేశంలో అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్ నుంచి "మేడ్ ఇన్ తెలంగాణ" స్టెంట్లు, కేథెటర్లు యూఎస్, జపాన్ తో సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి" అని ఈ సందర్భంగా వివరించారు. "లైఫ్ సైన్సెస్ లో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్ లో ఫార్మా విలేజెస్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని చెప్పారు. "లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య



మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవ శాస్త్ర దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అందించబోతున్నాం. ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా డాక్టర్ రెడ్డీస్, అరబిందో లాంటి సంస్థలతో కలిసి తెలంగాణ యువతకు శిక్షణ ఇస్తున్నాం. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్(సీ4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లకు లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులను తీర్చి దిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. "లైఫ్ సైన్సెస్ రంగంలో 'తెలంగాణ' బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రత్యేకంగా 'తెలంగాణ కాంప్రెహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ'కి శ్రీకారం చుట్టాం. ఇది చివరి దశలో ఉంది. ఈ రంగాన్ని కేవలం పరిశ్రమలు లేదా ఆర్ అండ్ డీ సెంటర్లకే మేం పరిమితం చేయడం లేదు. టెక్నాలజీ మేళవింపుతో ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఇప్పటికే మూడు జిల్లాల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల ను ముందే గుర్తించేందుకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని వివరించారు. కార్యక్రమంలో పలు దిగ్గజ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సుప్రీం కోర్ట్ సి.జె. జస్టిస్ గవాయ్ కు ఘన స్వగతం పలికిన సి.ఎస్, డీజీపీ లు

హైదరాబాద్, జూలై 11(సమయం న్యూస్): రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన భారత సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ శ్రీ భూషణ్ రామకృష్ణ గవాయ్ కు నేడు సాయంత్రం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. షంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తో పాటు సుప్రీం కోర్ట్ జడ్జి జస్టిస్ పగిడిగంటం శ్రీ నర్సింహా లకు రాష్ట్ర హై కోర్టు ఆక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, డీజీపీ డా. జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ సి,పై హొహంతి,ఏ.జి. సుదర్శన్ రెడ్డి తదితరులు ఘం స్వగతం పలికారు.







## భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాచలం జూలై,11(సమయం న్యూస్) : ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది ఉధృతి పెరుగుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సూచించారు.ఈ రోజు భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించి అక్కడ ఉన్న అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. విపత్కర సమయాలలో ప్రజలకు అండగా ఉండేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు.వరదల నేపథ్యంలో పోలీసు శాఖ తరపున ఐదు డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.



## బల్దియా ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన కమీషనర్

* **విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన మలేరియా ఉద్యోగి నెల జీతం నిలుపుదలకు ఆదేశించిన కమిషనర్**

వరంగల్ జులై 11(సమయం న్యూస్) : కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ, ఉద్యోగులు పనిచేసే వాతవరణాన్ని కల్పించాలని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పాత భవనం లోని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, 2వ, అంతస్తులలోని అన్ని విభాగాలను కమీషనర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్ ల గది, కంట్రోల్ రూమ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, మలేరియా. అకౌంట్, కంప్యూటర్, ఎస్టాబ్లిష్మెంట్ విభాగాలను పరిశీలించి ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది జాబ్ చార్ట్, ప్రగతిని



అడిగి తెలుసుకున్నారు. ఆయా అంతస్తులోని పలు విభాగాలలో మరమ్మతులు నిర్వహించుటకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదనవు కమిషనర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మలేరియా విభాగం ఉద్యోగిని గమనించిన కమిషనర్ వెంటనే అతని ఈ నెల జీతం మంజూరు చేయకూడదని (నిలుపుదల) అదనపు కమిషనర్ కు ఆదేశించారు. కమిషనర్ వెంట బల్దియా అదనపు కమీషనర్ జోనా, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజిరెడ్డి, ఎం హెచ్ ఓ రాజేష్, పర్యవేక్షకులు ఆనంద్, రామకృష్ణ, దేవేందర్, ఐటి మేనేజర్ రమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రతి మండలానికి 4-6 మంది లైసెన్స్డ్ సర్వేయర్లు

* **ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో**
* **ఈనెల 27వ తేదీన అర్హత పరీక్ష**
* **ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి**
* **రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ జూలై 11(సమయం న్యూస్) : రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసి భూ సమస్య లపై సామాన్యులకు మెరుగైన సేవలందించడానికి వీలుగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి జీపీవో, ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి నాలుగు నుంచి ఆరు మంది వరకు లైసెన్స్డ్ సర్వేయర్లను యమించబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రిగారు మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఈనెల 27వ తేదీన శిక్షణ పొందిన లైసెన్స్డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని ఆ తర్వాత 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని, ఆగస్టు 12వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని తెలిపారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావలన్న లక్ష్యంతో లైసెన్స్డ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని ఇందులో తొలివిడతలో 7వేల మందికి 33 కేంద్రాల్లో మే 26వ తేదీనుంచి శిక్షణ ప్రారంభించామని ఈనెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. మిగిలిన 3వేల మందికి ఆగస్టు 2వ వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని సర్వే విభాగం బలోపేతం తోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామని గతపదేళ్ళలోసర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం విఆర్వో, వి ఆర్ ఎలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో అర్హత పరీక్ష నిర్వహించగా 3554 మంది ఎంపికయ్యారని తెలిపారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్థన మేరకు ఈనెల 27న మరోసారి వీరికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి**

గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలలో ప్రయోగాత్మకంగా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. పైలెట్ గ్రామాలైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ లోని 845 ఎకరాలు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ లో 593 ఎకరాలలో మొత్తం ఐదు గ్రామాలలోని 2988 ఎకరాలలో చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈసర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. దీని వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం..

* **పి ప్రావీణ్య జిల్లా కలెక్టర**
* **వసతి గృహాల సంక్షేమ అధికారులతో కలెక్టర్ సమీక్ష**

సంగారెడ్డి జులై 11(సమయం న్యూస్) : విద్యార్థులు మన భవిష్యత్తు అని వారికి నాణ్యమైన విద్యావాతవరణం కల్పించాల్సిన బాధ్యత సంక్షేమాధికారులదని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలఅధికారులతో, జిల్లాలో వసతి గృహాల నిర్వహణ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విస్తృతంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వసతి గృహాలలో మౌలిక సదుపాయాల విషయమే ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. వసతి గృహాలలో నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు, మంచినీటి నాణ్యత, ఆరోగ్యకరమైన వాతావరణం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి మెనూను పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు సరైన సమయంలో పాఠ్యపుస్తకాలు నిబంధనలకు అనుగుణంగా యూనిఫాంలో అవసరమైన



పాఠశాల సామాగ్రి అందించాలన్నారు. వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాల్సిన మరమ్మతులు వివరాలు అందించాలని, పెండింగ్ పనులు వేగంగా పూర్తీ చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఅదనపుకల్లెక్టర్ చంద్ర శేఖర్, సాంఘీక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవుజా పాల్గొన్నారు.

## యూరియా కోసం తిప్పలు..




రాయపోల్,జూలై 11: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రం రాయపోల్ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. పనులన్నీ మానుకొని సరఫరా కేంద్రాల వద్ద రోజంతా క్యూలో నిల్చుని పడిగాపులు కాస్తున్నారు.వానాకాలం సీజన్లో రైతులకు అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయలేక అటు ప్రభుత్వం ఇటు వ్యవసాయ శాఖ ఆపసోపాలు పడుతున్నాయి.గత 20 రోజులుగా యురియా కోసం రైతులు ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. మండల కేంద్రం రాయపోల్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి శుక్రవారం 530 బస్తాల యూరియా రావడం తో ఉదయం నుంచి రైతులు క్యూ లైన్ లో నిల్చున్నారు.చుట్టుప్రక్కల రైతులు పెద్ద సంఖ్యలో రావడం తో కొందరికే యూరియా దొరికింది. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే సలహాలు,సూచనలు ఇవ్వాల్సిన ఎఇఓ లు వ్యవసాయ అధికారులు పట్టించు కోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా యూరియా కొరతను అదునుగా చూసి డీలర్లు రషీద్ పై ధరలు వేయకుండానే ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారని,యురియా ధర.290 ఉంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు డీలర్లు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

epaper.samayamdaily.net
సమయం



## ఆలోచన అదిరే...సమయం తగ్గే

రాయపోల్,జూలై 11 వ్యవసాయం సాగులో రైతులు ఎప్పటికప్పుడు నూతన ఆలోచనలతో సులువైన మార్గాలను ఎంచుకుంటున్నారు. సస్యరక్షణ చర్యల్లో భాగంగా పంటలకు పురుగుమందు పిచికారి తప్పనిసరి. పత్తి పంటలో పిచికారి చేయాలంటే ఒక్కో వరుసలో ఒక్కోసారి నడుస్తూ పిచికారి చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఆలోచించిన మండల కేంద్రం రాయపోల్ గ్రామానికి చెందిన గల్వ సందీప్ రెడ్డి అనే రైతు ద్రావణాన్ని పత్తి పంటపై పిచికారి చేసేందుకు పిచికారి యంత్రం పొడవాటి గొట్టానికీ అడ్డం ఒక గొట్టం బిగించి అడ్డం గొట్టం అటు చివర,ఇటు చివర రెండు నాబీలు ఏర్పాటు చేసి, ఒకేసారి రెండు



వరుసలోని పత్తి మొక్కలపై ద్రావణాన్ని చల్లుతున్నాడు. ఈ విధానంతో పిచికారి చేసే సమయం 50 శాతం ఆదా అయ్యిందని రైతు చెబుతున్నాడు.




## సి ఎం ఆర్ రైస్ డెలివరీ వేగవంతం చేయండి

**జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ జాన్**

నిర్మాక్ జులై 11(సమయం న్యూస్) : సీఎంఆర్ (కష్టం మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2023 24 సంవత్సరానికి గాను సన్న రకం వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 32,200 టన్నుల సన్న వరి ధాన్యాన్ని మిల్లింగ్



చేసి జూలై 27వ తేదీలోపు ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. మిల్లర్ల వారీగా సీఎంఆర్ మిల్లింగ్ పురోగతిని సమీక్షించిన అదనపు కలెక్టర్, డెలివరీని కాలపట్టిక ప్రకారం పూర్తి చేయని మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వెనుకబడిన మిల్లర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ సుధాకర్, అధికారులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

* **సూర్యాపేట మండలం బాలెంలలో ఆకస్మిక తనిఖీలు చేసిన.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జులై 11(సమయం న్యూస్) : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం బాలెంల పల్లె దవాఖాన ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు.వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకి అందుబాటులో ఉండాలని అన్నారు.రక్త హీనతతో భాధపడుతున్న పేషెంట్స్ ఎంత మంది ఉన్నారు వాళ్ళ చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ ఆవరణలోని వాటర్ ట్యాంక్ ని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా క్లీన్ చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శిని అదేశించారు.వ్యాధి నిరోధక టీకాలు వేసే రోజు పేషెంట్స్ వచ్చినపుడు కూర్చోడానికి కూడా వీలు ఉండట్లేదు అని డాక్టర్ చెప్పగా వెంటనే వెయిటింగ్ షెడ్ నిర్మించాలని గ్రామ కార్యదర్శిని అదేశించారు ఇట్టి నివేదికను రెండు రోజులలో ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి బాలెంల ప్రాథమిక పాఠశాల సందర్శించి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి నాలుగవ తరగతి క్లాస్ లోకి వెల్లి సుశాంత్ అనే విద్యార్థిని ఇంగ్లీష్, అనుష్క అనే బాలికను తెలుగు చదివించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి తెలుగు, ఇంగ్లిష్ భాష లలో పట్టు సాధించాలని అన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉండే గుంటలను మట్టి పోయించాలని పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. తదుపరి అంగన్వాడి కేంద్రం సందర్శించి సెంటర్లో ఎంత మంది పిల్లలు ఉన్నారు వారికి అందుతున్న మెనూ వివరాలు తెలుసుకున్నారు. తదుపరి పిల్లల చేత పదాలు చదివించారు కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ అంగన్వాడి కేంద్రంగా మార్చుటానికి ప్రతిపాదనలు పంపాలని, టాయిలెట్స్ ఎత్తు పెంచుకోవాలని, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయవలసిందిగా ఆదేశించారు. మెడికల్ అధికారి మణిరత్నం, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ నీరజలత, ఉపాధ్యాయులు రేణుక, ఎల్లమ్మ అంగన్వాడి టీచర్ నాగమ్మ, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విరివిగా పంట రుణాలు పంపిణీ చేయాలి

* **జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

నిజామబాద్, జూలై 11(సమయం న్యూస్) : రుణాల పంపిణీలో నిర్దే శిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు అంకిత భావంతో కృషి చేస్తూ, తద్వారా ఆయా వర్గాల అభ్యaxన్నతికి బ్యాంకర్లు దోహదపడాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్నందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత వానాకాలం పంటలకు గాను రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేశారు. వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర, ఇతర అన్ని రంగాలకు కలిపి రూ. 17990.59 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు రూ. 13928.92 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని వార్షిక ప్రణాళికలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని






సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ, వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న రుణ వసతి గురించి వారికి అవగాహన కల్పిస్తూ, ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులకు విద్యా రుణాలను అందించేందుకు చొరవ చుపాలన్నారు. అదేవిధంగా వివిధ వర్గాల అభ్యున్నతి, ఆర్థిక ప్రగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాల కింద బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలని అన్నారు. వీధి వ్యాపారాలు నిర్వహించే వారికి సూక్ష్మ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని, తద్వారా వారు వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునేందుకు ఆర్థిక తోడ్పాటును అందించినట్లు అవుతుందన్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాలలో అరవై సంవత్సరాలు పైబడిన వారికి కూడా బ్యాంకు ఖాతాలు తెరిచి, అవసరమైన వారికి రుణాలు అందించాలని సూచించారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది దివ్యాంగులు సభ్యులుగా ఉన్న సంఘాలకు కూడా బ్యాంకులలో ఖాతాలు తెరిచేందుకు అనుమతించాలని అన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయము చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్దిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్బీఐ ఎల్.డీ.ఓ రాములు, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## మొబైల్ హాస్పిటల్ మరియు అంబులెన్సు సేవలు ప్రారంభం

: **ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గారు**

చర్ల, జూలై 11(సమయం న్యూస్) : చర్ల మండలంలోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన పూసుగుప్పలో ఈ రోజు మొబైల్ హాస్పిటల్ మరియు అంబులెన్స్ సేవలను ప్రారంభించడం జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గారితో పాటు, జిల్లా కలెక్టర్ జితేష్. వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ లు పాల్గొన్నారు.స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ నిధుల ద్వారా విడుదలైన కోటి రూపాయల వ్యయంతో ఈ మొబైల్ హాస్పటల్ ను నిర్మించడం జరిగింది.చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారి సారథ్యంలో పోలీస్ శాఖ విశేష సేవలను అందిస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గారు ఈ సందర్భంగా అన్నారు. పూసుగుప్ప గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా అత్యవసర చికిత్స అవసరమైతే భద్రాచలం,కొత్తగూడెం పట్టణాలకి వెళ్లడానికి ఒకప్పుడు సరైన రహదారి కూడా లేదని,కానీ ఇప్పుడు ఇదే పూసుగుప్ప గ్రామానికి చర్ల నుండి అరగంట వ్యవధిలోనే చేరుకునే విధంగా రహదారిని మరియు ఇప్పుడు ఈ హాస్పిటల్ ని ప్రారంభించడంలో చర్ల పోలీసుల కృషి ఎంతగానో ఉందని అన్నారు.ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి సేవలను పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అందవలసిన సంక్షేమ పథకాలు కానీ,అభివృద్ధి కార్యక్రమాలు గానీ ఆదివాసీ ప్రజలకు అందజేయడంలో జిల్లా పోలీసుల కృషి అభినందనీయం అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజ లకు విద్య,వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ



ప్రభుత్వం తరపున పోలీస్ శాఖ ఏజెన్సీ ప్రాంతవాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడంలో స్థానిక పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ఆదివాసీ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. సరిహద్దు చత్తీస్గడ్ రాష్ట్ర గ్రామాలైన రాంపురం,భీమారం గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం అంబులెన్స్ వాహన సేవలను ప్రారంభించారు. ఇటీవల పూసుగుప్ప నుండి రాష్ట్ర సరిహద్దు వరకు నూతనంగా నిర్మితమైన బీటి రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్,చర్ల ఇన్స్పెక్టర్ రాజు వర్మ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ చెన్నూరి శ్రీనివాస్, E. శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## రుద్రారంలో హనుమాన్ దేవాలయం పై దాడి

* **తీవ్రంగా ఖండించిన నాయకులు**
* **ఘటన అత్యంత దురదృష్టకరం, త్వరలోనే విగ్రహాల పున ప్రతిష్ట, సీసీ కెమెరాలు ఏర్పాటు**
* **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **దోషులను కఠినంగా శిక్షించాలి ఎంపీ రఘునందన్ రావు**

పటాన్ చెరు,జూలై 11, సమయం న్యూస్: ఆంజనేయ స్వామి దేవాలయంలో దాడి చేసి కొన్ని విగ్రహాలను ధ్వంసం చేసి, హనుమాన్ విగ్రహాన్ని కాల్చి వేసిన ఘటన గురువారం సాయంత్రం పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో జరిగింది. ఈ ఘటనను స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎంపీ రఘు నందన్ రావులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో చర్చించి అతి త్వరలోనే విగ్రహాల పునః ప్రతిష్ట తో పాటు సీసీ కెమెరాలు, బలిపీఠం, ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయబోతున్నట్టు ఆయన తెలిపారు. పోలీసు అధికారులతో చర్చించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు సంయమనమతో వ్యవహరించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరమత సహానానికి పటాన్చెరువు నియోజకవర్గం ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలయాలపై దాడి చేసిన ప్రతి ఒక్కరిని మతిస్థిమితం లేని వ్యక్తులుగా నిర్ధారించడం ఏమిటని ఆయన పోలీసులను ప్రశ్నించారు. దాడి చేసిన వారు వేరే రాష్ట్రాల నుంచి ఎందుకు వచ్చి చేస్తారని ఆయన అన్నారు. రాష్ట్రంలో మదర్సాలలో, మసీదులలో, చర్చిలలో ఇతర రాష్ట్రాల వారికి ఏమి పని అని ఆయన ప్రశ్నించారు. ఈ దాడి ఒక పథకం ప్రకారం చేసినట్లు అనిపిస్తుందని ఆయన అన్నారు. ఇకనైనా పోలీసు శాఖ వారు చర్చిలు, మదర్సాలు, మసీదులపై తనిఖీలు నిర్వహించి స్థానికేతరులు అయితే వారిని పంపించాలని ఆయన సూచించారు. కొన్ని ప్రాంతాలలో విధ్వంసానికి శిక్షణ ఇచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు పంపిస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీస్ శాఖ వారు సరైన తనిఖీలు నిర్వహించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పటాన్ చెరు డిఎస్పి ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, రుద్రారం పిఎసిఎస్ అధ్యక్షులు పాండు, మాజీ ఎంపీటీసీలు రాజు, హరి, ప్రసాద్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

సమయం
epaper.samayamdaily.net
APTEL/2006/18267



# ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుటకు సహకరించండి

: నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

* కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి వర్తక వాణిజ్య వ్యాపారస్తులకు అవగాహన కల్పించిన మేయర్...
* 14420 టోల్ ఫ్రీ నెంబర్ వినియోగం పై విస్తృత ప్రచారం కల్పించాలి..



వరంగల్ జులై 11(సమయం న్యూస్) : ప్లాస్టిక్ రహిత వరంగల్ మహానగరంగా తీర్చిదిద్దుటకు అందరి సహకారం అవసరమని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి పేర్కొన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజారోగ్య విభాగం, ఆస్కీ సంయుక్త ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ అంశాల పై (డీ స్లడ్జింగ్ ఆపరేటర్ లతో)నిర్వహించిన సమావేశంలోమేయర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని వర్తక వాణిజ్య వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా అంకితభావంతో కృషి చేయాలని, 120 మైక్రాన్ కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడితే పర్యావరణం తో పాటు మానవ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ ప్రత్యామ్నంగా వినియోగం తర్వాత కంపోస్ట్ గా మారే పర్యావరణానికి విఘాతం కలిగించని బయో డిగ్రేడబుల్ సంచులు, వస్త్ర, జ్యూట్ సంచులు నిత్యజీవితం లో వాడేలా అవగాహన కల్పించాలన్నారు. మహా నగరం లో ప్లాస్టిక్ సంబంధ ఉత్పత్తులు విక్రయించే దుకాణదారులు ఎలాంటి ప్లాస్టిక్ క్రయ విక్రయాలు జరుపకూడదని, స్టోర్ లో నిలువ ఉండకూడదని, ఒకవేళ ఎవరైనా విక్రయిస్తే సమాచారం అందజేయాలని, నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మితే లక్ష రూపాయల జరిమానా తో పాటు దుకాణాన్ని మూసివేసి, నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు రవాణా చేసిన వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని, ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయ హోల్ సేల్, రిటైల్ వ్యాపారాలు కార్పొరేషన్ కు సహకరిస్తూ పర్యావరణ హితం కోసం పాటు పడుతూ ప్లాస్టిక్ రహిత నగరం గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. బల్దియా పరిధి 44 వ డివిజన్ లోని అమ్మవారి పేట లో నగర అవసరాలకు అనుగుణం గా 150 కే ఎల్ డి సామర్థ్యం తో నిర్మిస్తున్న మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం సిద్ధం కావడం జరిగిందని, నగర వ్యాప్తంగా 2.50 లక్షల గృహాలు ఉన్నాయని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం ప్రకారం ప్రతి 3 సం.లకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అధికారికంగా బల్దియా అనుమతులు ఇచ్చిన సెప్టిక్ ట్యాంకర్ ల ద్వారా మాత్రమే శుభ్రం చేయించుకోవాలని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా గుర్తించి అనుమతులు ఇచ్చిన ట్యాంకర్ ల ద్వారా మాత్రమే సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ జరగాలని, ట్యాంకర్ లు వ్యర్థాలను విధిగా ఎఫ్ ఎస్ టి పి కి అందజేయాలని, అనధికారిక సెప్టిక్ ట్యాంక్ లు నగరం లో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు డంప్ చేస్తే జరిమానా తో పాటు వాహనం సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని అన్నారు. డీ స్లడ్జింగ్ ఆపరేటర్ లు,ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించే దిశ గా అందరూ సహకరించాలని ప్రైవేటు సెప్టిక్ ట్యాంకర్ ఆపరేటర్ లు కార్పొరేషన్ ద్వారా ఎంప్యానల్ చేసుకొని అధికారికం గా సెప్టిక్ ట్యాంక్ లు నిర్వహించుకోవచ్చునని మేయర్ తెలిపారు. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ మహానగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మనుషుల ద్వారా సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడాన్ని చట్టం నిషేదించిందని, కేవలం యంత్రాల ద్వారా మాత్రమే శుభ్రపరుచుకోవాలని ఇందుకోసం కార్పొరేషన్ తరపున 14420 టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేశామని, ఇట్టి నెంబర్ పై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. అనంతరం డి స్లడ్జింగ్ ఆపరేటర్లకు మేయర్, కమిషనర్ లు రక్షక కవచాలు అందజేశారు. ఈ సమావేశంలో ఆదనపు కమిషనర్ జోనా, సీఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఆస్కి కోఆర్డినేటర్ రాజమోహన్ రెడ్డి, శ్వేతా, స్లడ్జింగ్ ఆపరేటర్లు, నగరంలోని వర్తక వాణిజ్య వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాల కృతజ్ఞతలు

హైదరాబాద్ జులై 12సమయం న్యూస్) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బీసీ సంఘాల నాయకులు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన బీసీ సంఘం నాయకులు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్. కృష్ణయ్య, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, బీసీ సంఘం నాయకులు.



## కాటారం తహసిల్దార్ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ

* జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

కాటారం జూలై 11(సమయం న్యూస్) : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం కాటారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్ళను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి లో వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని ఎంత మందికి నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. మొత్తం మండలంలో 5,610 భూభారతి దరఖాస్తులు వచ్చాయని అందులో 412 మంది దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపగా, భూ భారతి లో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆగస్ట్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు డిటి రామ్మోహన్, ఆర్.ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ టీబీ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రులను
# సందర్శించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





హనుమకొండ జులై 11(సమయం న్యూస్) : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్న ప్రజలకు నిర్వహిస్తున్నటువంటి పరీక్షలలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎక్స్ రే పరీక్షల తీరును అలాగే ఇంకా ఎక్కువ మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ టీబీ హాస్పిటల్ ను సందర్శించారు. ఆసుపత్రిలో ప్రతిరోజు ఎన్ని ఎక్స్ రే లు తీస్తున్నారు, ఇంకా ఎక్కువ చేయడానికి అవకాశం ఉందా, ఇప్పటివరకు ఎన్ని ఎక్స్ రే లు తీశారని అని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా ప్రస్తుతం 30 నుంచి 40 వరకూ తీస్తున్నామని, ఇప్పటివరకు 220 తీశామని 90 నుండి 100 వరకు తీసే అవకాశం ఉందని కానీ ఒక్కరే రేడియోగ్రాఫర్ అందుబాటులో ఉన్నారని టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలుపగా, పీహెచ్సీ లలో ఎక్కడైనా రేడియోగ్రాఫర్ ఉన్నట్లయితే టీబీ ఆసుపత్రికి డిప్యూటీ చేయాలని డిఎంహెచ్ఓని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపి విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఉన్న డయాగ్నొస్టిక్ విభాగాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఎక్స్ రే మిషను, అలాగే రోజువారి సామర్థ్యాన్ని, అందుబాటులో ఉన్న టెక్నీషియన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం టీబీ చికిత్స పొందుతున్నటువంటి వ్యాధిగ్రస్తులందరికీ ముందుగా ఒక నెల పోషకాహార కిట్ అందించాలని, మిగతా చికిత్స కాలంలో కూడా వారికి పోషకాహార కిట్ అందించే దిశగా ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ అప్పయ్య, టీబీ ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, టీహబ్ మేనేజర్ కౌముది, తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేట ఆర్ఓబి పనులను త్వరగా పూర్తి చేయాలి

* హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
* నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్

హనుమకొండ: జూలై 11(సమయం న్యూస్) : కాజీపేట ఆర్ఓబి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కాజిపేట ఫాతిమా నగర్ సమీపంలో కొనసాగుతున్న ఆర్ఓబి నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఆర్ఓబి నిర్మాణ పనులను, ఇంకా పూర్తి చేయాల్సిన పనులను గురించి ఆర్ అండ్ బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 72 మీటర్ల బోస్ట్రింగ్ గడ్డర్స్ ఒకవైపు పూర్తయిందని, మరొకవైపు పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ సురేష్ బాబు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆర్ఓబి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆర్ఓబి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

* వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..



హనుమకొండ జులై 11(సమయం న్యూస్) : నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వరంగల్ పశ్చిమ నియోజక వర్గ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్లు, కాజీపేట ఆర్వోబీ నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ, ఆర్ అండ్ బీ, సాగునీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం కాకుండా వేగంగా చేపట్టాలన్నారు. అధికారులు, గుత్తే దారు సంస్థ సమన్వయంతో పనులు పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలో రెండు పడక గదుల ఇళ్లు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన వివరాలను, ఇప్పటివరకు వాటి పురోగతిపై కలెక్టర్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనుల గురించి సాగునీటిపారుదల శాఖ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, హౌసింగ్ పిడి రవీందర్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, సాగు నీటి పారుదల శాఖ ఈఈ శంకర్, హనుమకొండ,కాజీపేట తహసీల్దారులు రవీందర్ రెడ్డి, భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



పటాన్ చెరు (అమీన్ పూర్), జూలై 11, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా,పటాన్ చెరు నియోజకవర్గం లోని అమీన్ పూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పటాన్ చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పటాన్చెరు అబ్జర్వర్ పరిగి శాసన సభ్యులు రామ్మోహన్, టిజిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ దయాకర్ లు హాజరైనారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని గ్రామ, మండల, బ్లాక్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే ఆయువు పట్టని వారు సూచించారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొనాలని సూచించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం





భామిని మండలం బత్తిలి గ్రామంలో జరిగిన భామిని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్ నూతన SK ఫ్యామిలీ రెస్టారెంట్ నీ ప్రారంభించిన పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ

*- సమయం న్యూస్, భామిని, జూలై 11*

# జూబ్లీహిల్స్ నియోజక వర్గం లో 5.12 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన

- **ప్రజా పాలన ప్రభుత్వం లో హైదరాబాద్ లోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పై ప్రణాళిక..**
- **జూబ్లిహిల్స్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో ముందుంచుతాం.**
- **ప్రజా పాలన ప్రభుత్వాన్ని ఆస్వాదించండి.. అండగా ఉండండి**
- **జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్,తుమ్మల నాగేశ్వరరావు,వివేక్ వెంకటస్వామి**





హైదరాబాద్,జూలై 11(సమయం న్యూస్) : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 5.15 కోట్ల రూపాయల తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. షేక్ పేట్ వార్డులో 315.90 లక్షల వ్యయం తో చేపట్టనున్న ఫ్లైఓవర్ క్రింద స్పోర్ట్స్ పార్క్ కి, కమ్యూనిటీ డెవలప్మెంట్, ఫుట్ పాత్ తో పాటు హరిజన బస్తీ వద్ద సిసి రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఇక వెంగల్ రావు నగర్ వార్డు లో గురుద్వార్ కమాన్ వద్ద 100. 5 లక్షల వ్యయం తో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం యూసఫ్ గూడ వార్డులో రూ.95.75 లక్షల వ్యయం తో కమలాపురి అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పక్కన చేపట్ట నున్న సీసీ రోడ్ల నిర్మాణలకు శంకుస్థాపన చేశారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గం లో ఈరోజు 5 కోట్ల రూపాయలకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని జూబ్లిహిల్స్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో ముందుంచుతామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు తొలగిస్తున్నామన్నాడు. గత 10 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీలు అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించిన వారిలో వారికి సన్నిహిత ఉన్నవారి నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి జరిగాయని వివక్షపూర్తితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్ ల తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కారం చేస్తున్నామని నగరంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నామన్నారు. నగర ప్రజలు ఎక్కడైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక అధికారి, ప్రజా ప్రతినిధుల దృష్టికి లేదంటే మంత్రుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని,సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, తమ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అండగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాము ఎక్కడికి వెళ్లిన ప్రజలు నాళాలు, సీసీ రోడ్లు, డ్రింకింగ్ వాటర్ సమస్యలను తీర్చమని పబ్లిక్ కోరుతున్నారని ప్రజా సమస్యలన్నింటినీ తీరుస్తామన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే స్పెషల్ శాంక్షన్ చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కమిషనర్ ఆర్వీ కర్ణన్,కలెక్టర్ దాసరి హరిచందన, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, అధికారులు పాల్గొన్నారు.



# పటాన్ చెరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- **2.51 కోట్లతో పలు అభివృద్ధి పనులు**
- **పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు,జూలై 11, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్, వెంకటేశ్వర కాలనీ, ఆల్విన్ కాలనీ, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలలో పలు అభివృద్ధి పనులకు, యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, ముదిరాజ్ సంఘం స్మశాన వాటికలలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు డివిజన్ పరిధిలో 2.51 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు. కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, యువ నాయకుడు పృథ్వీరాజ్, పట్టణ పుర ప్రముఖులు, కాలనీలవాసులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన జీహెచ్ఎంసీ






హైదరాబాద్, జూలై 11:(సమయం న్యూస్,). వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, నగరంలోని రోడ్లపై ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడటమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఇంటెన్సివ్ మెయింటెనెన్స్ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ (మెయింటెనెన్స్) విభాగం ఆధ్వర్యంలో 7500 ప్రాంతాలలో గుర్తించిన బీటీ / సీసీ రోడ్లపై పాట్‌హోల్స్ ఫిల్లింగ్, క్యాచ్ పిట్స్ మరమ్మతులు, సెంట్రల్ మీడియన్‌లలో మైనర్ రిపేర్లు తదితర పనులను వేగవంతంగా చేపట్టారు. ఈ పనులలో భాగంగా చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్ శుక్రవారం ఎర్రమంజిల్ ప్రధాన రహదారిపై జరుగుతున్న మరమ్మత్తు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు, నగరంలోని వాహనదారులకు రహదారులపై సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే 7500 ప్రాంతాల్లో సమస్యాత్మకంగా గుర్తించిన రోడ్ల పై మరమ్మత్తుల పనులు ఒక వారం లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని, ప్రజల భద్రతే ముఖ్యమని చీఫ్ ఇంజినీర్ స్పష్టం చేశారు.




# డిజిటల్ మోసాలకు అంబుడ్స్మన్ పథకం

- **ఆర్ బి ఐ సి జి ఎం. సింగల సుబ్బయ్య..**

మెదక్ జులై 11(సమయం న్యూస్) : డిజిటల్ లావాదేవీలకు సం బంధించిన మోసాల విషయంలో పరిష్కరించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) రూపొందించిన గొప్పపథకం.అంబుడ్స్మన్ పథకం అని ఆర్.బి.ఐ సీ.జీ.ఎం సింగల సుబ్బయ్య,తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, నందు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ మోసాలు, పరిష్కారాలపై వినియోగదారుల హక్కులు ఫిర్యాదు చేయవలసిన విధానాలపై క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్.బి.ఐ సీ.జీ.ఎం సింగల సుబ్బయ్య, ఎల్డిఎం నరసింహమూర్తి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలలో వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడం. డిజిటల్ మోసాల గురించి అవగాహన కల్పించడం.డిజిటల్ మోసాల వలన కలిగే నష్టాల గురించి, ఫిర్యాదులను ఎలా దాఖలు చేయాలో. RBI అంబుడ్స్మన్ పథకం గురించి,. వినియోగదారుల హక్కులు మరియు బాధ్యతల గురించి,. డిజిటల్ లావాదేవీలలో భద్రతా చర్యల గురించి సుదీర్ఘంగా వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి ఉమాదేవి,, వినియోగదారుల విద్య మరియు రక్షణ శాఖ జనరల్ మేనేజర్ శ్రీమతి దీప్తి బ్రిజ్రాజ్, డీ.జీ.ఎం కళ్యాణ్ చక్రవర్తి, జి.ఎం ఎఫ్. ఐ. డి. డి సుప్రభాత్, ఏజీఎంలు కిరణ్, శ్రావ్య, నాబార్డ్ డి. డి. ఎం కృష్ణ తేజ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# లాల్ దర్వాజా మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కమీషనర్ ఆర్.వి.కర్ణన్






*హైదరాబాద్, జూలై 11:(సమయం న్యూస్,). గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్.వి.కర్ణన్ శుక్రవారం ఉదయం పాతబస్తీలో ప్రసిద్ధిగాంచిన లాల్ దర్వాజా సి సింహవాహిని మహంకాళి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో సత్కరించి ఆలయ మర్యాదల మేరకు అమ్మవారి ఆశీస్సులు అందేలా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆలయ కమిటీ సభ్యులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దేవాలయం పరిసరాలలో శుభ్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... "ఎన్నో రోజులుగా లాల్ దర్వాజా మహంకాళి దేవాలయాన్ని దర్శించాలనే కోరిక ఉండేదని, ఈ రోజు అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పాతబస్తీలోని ఈ దేవాలయానికి చారిత్రక ప్రాముఖ్యతతో పాటు విశిష్టత కూడా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు హైదరాబాద్ నగర ప్రజలందరినీ కాపాడాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు.

# పిఎస్బి ద్వారా మొక్కల పెరుగుదల వేగవంతం అవుతుంది

వ్యవసాయ విస్తరణ అధికారి మజీద్ అలీ



వెల్దుర్తి జులై 11, (సమయం న్యూస్) : వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామంలో పిఎస్బి భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా ద్వారా వరి నారు వేరు క్షేత్ర స్థాయి ప్రదర్శన వ్యవసాయ విస్తరణ అధికారి మజీద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో ముందుగా ఒక్క చిన్న మడుగులో ముప్పై, లీటర్ల నీళ్ళు ఉండేలా చేయాలని, అందులో పిఎస్బి ద్రావణం వేసి, తరువాత వరి నారు ను పదిహేను, నుండి ముప్పై, నిమిషాలు ఉంచి వరి నాటు వేసుకోవాలన్నారు. ఇలా చేస్తే ప్రధాన పొలంలో వచ్చే తెగుళ్ల బెడద తగ్గుతుందని, మరియు పిఎస్బి ఫాస్పరస్ కరిగించే బాక్టీరియా అనేది మొక్కలకు ఉపయోగపడని ఫాస్పరస్ ను మొక్కలు గ్రహించేలా మారుస్తుందన్నారు. నేలలోని కరగని ఫాస్పరస్ ను, మొక్కలు ఉపయోగించుకునేలా చేస్తుందని, వరి దిగుబడి కూడా పేరుతుందన్నారు. రైతులు నాటు వేసే ముందు వరి నారు చివర ఆకులని కత్తిరించి లేదా తుంచి నాటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు సాదాల నర్సింలు, నరేశ్, అంజయ్య పాల్గొన్నారు..

# మంత్రిని కలిసిన రాయపోల్ కాంగ్రెస్ నాయకులు



రాయపోల్, జూలై 11 : నూతనంగా నియమితులైన పశు సంవర్ధక,క్రీడలు,మత్స్య, యువజనసేవలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ని శుక్రవారం రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన వారిలో సిద్దిపేట జిల్లా యువజన ఉపాధ్యక్షులు సిద్ధం శశికాంత్, రాయపోల్ మండల యూత్ అధ్యక్షులు కొంగరి దయాకర్, మాజీ ఎంపిటిసి కొత్తపల్లి స్వామి, వీరారెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు పాపని అంజనేయులు, అనిల్ గౌడ్, రమేష్ యాదవ్, గుంటి నర్సింలు, జానీ గౌడు, లక్ష్మారెడ్డి, నీరుడి నరేష్ తదితరులున్నారు.

# కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ ఉందా? భట్టి విక్రమార్క ఏం చెప్పారంటే...

* కర్ణాటక తరహాలో పవర్ షేరింగ్ లేదన్న మల్లు భట్టి విక్రమార్క
* బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని విమర్శ
* కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని మండిపాటు



కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వంలో అందరం టీమ్ వర్క్‌తో పని చేస్తున్నామని ఆయన అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, ప్రజల్లోకి వెళ్లడం లేదని విమర్శించారు. రూ. 2 లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది తమ ప్రభుత్వం నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఆధారంగానే రుణమాఫీ చేసినట్లు చెప్పారు. సన్న బియ్యం విజయవంతమైందని, గతంలో వలె పక్కదారి పట్టడం లేదని ఆయన అన్నారు. ఉచిత బస్సులకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మూసీ సుందరీకరణ పనులు ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతాయని హామీ ఇచ్చారు. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ పనులు జరిగితీరుతాయని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తోందని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశమే లేదని ఆయన వ్యాఖ్యానించారు.



## బండి సంజయ్‌కు రాజాసింగ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

* ఈరోజు బండి సంజయ్ 54వ పుట్టిన రోజు
* శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు నాయకులు, అభిమానులు
* బండి సంజయ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అమిత్ షా

కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రోజు బండి సంజయ్ 54వ పుట్టినరోజు కావడంతో ఆయనకు పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. "కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్న గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు" అంటూ రాజాసింగ్ ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా కూడా బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, భగవంతుడు మీకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఆనందాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఇదే నిబద్ధతతో, ఉత్సాహంతో దేశానికి సేవను కొనసాగిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అమిత్ షా 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలియజేయగా, బండి సంజయ్ ధన్యవాదాలు తెలుపుతూ రీట్వీట్ చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ, కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత

* ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పినందున రైల్ రోకోను వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి
* ఆర్డినెన్స్ తేవాలనుకుంటే 18 నెలలు ఎందుకు ఆగారని ప్రభుత్వానికి నిలదీత
* వారం రోజుల పాటు ప్రభుత్వం కార్యాచరణను గమనిస్తామన్న కవిత



స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం సంతోషకరమని, అయితే తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అందుకే ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్డినెన్స్ జారీ చేసిన వెంటనే రిజర్వేషన్లను అమలు చేయగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు ఎందుకు వేచి చూసిందని కవిత ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని తాము భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయని కవిత అన్నారు. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, కాబట్టి తలుచుకుంటే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వవచ్చని అన్నారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తప్పులన్నీ కాంగ్రెస్ పైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆమె అన్నారు. బీసీ బిల్లును షెడ్యూల్ 9లో పెట్టాలని, దీని కోసం బీసీ బిడ్డ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందున, ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనించి, అందుకు అనుగుణంగా తాము నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో కవితకు ఏం సంబంధం? : మహేశ్ కుమార్ గౌడ్

* రిజర్వేషన్ల క్రెడిట్ బీఆర్ఎస్ తీసుకోవడం ఏమిటని ప్రశ్నించిన టీపీసీసీ చీఫ్
* కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య
* కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని నిలదీత

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, ఆ ఘనతను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీసుకోవడం ఏమిటని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. ఈ నిర్ణయం వెనుక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆశయం ఉందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని అన్నారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీకి, కవితకు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. తాము చేసిన పనికి ఆమె క్రెడిట్ తీసుకోవడం ఏమిటని నిలదీశారు. కవితను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్లు ఏం చేశారో చెప్పకుండా ఆమె బీసీ పాట పాడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ గాంధీ అజెండా, రేవంత్ రెడ్డి నిబద్ధత అని ఆయన స్పష్టం చేశారు.



## రేణుకా చౌదరిపై నమోదైన కేసును కొట్టివేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు

* ఖమ్మం కోర్టులో రేణుకా చౌదరికి ఊరట
* ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ రేణుక మోసం చేశారంటూ కళావతి ఫిర్యాదు
* ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేసిన జడ్జి



కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట లభించింది. ఆమెపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కోర్టు కొట్టివేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2014లో తనకు, లేదా తన భర్తకు వైరా ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని చెప్పి రేణుకా చౌదరి మోసం చేశారంటూ భూక్య రాంజీ భార్య కళావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టును కూడా ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఖమ్మం జిల్లా కోర్టులోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. అయితే రేణుకపై ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పును వెలువరించారు. రేణుక తరపున సీనియర్ న్యాయవాదులు నిరంజన్ రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించారు.

## ప్రతి మండలానికి 46 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు : మంత్రి పొంగులేటి



హైదరాబాద్: తెలంగాణలోని ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 27న శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని.. ఆ తర్వాత 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 12న ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సర్వేయర్లతోపాటు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమించనున్నట్లు తెలిపారు. నక్షా లేని 413 గ్రామాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. నక్షా కోసం 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే చేశామని, వీటి ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

## కల్తీ కల్లు ఘటన.. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై సస్పెన్షన్ వేటు



హైదరాబాద్: కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో వేణుకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. డీటీఎఫ్ నర్సిరెడ్డి, ఏఈఎస్ మాధవయ్య, ఈఎస్ ఫయాజ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్ పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తోంది. కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కూకట్‌పల్లిలోని పలు కల్లు దుకాణాల నుంచి అధికారులు నమూనాలను సేకరించారు. ఈ క్రమంలో వాటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లలో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. రసాయనాలు కలిపిన కల్లు వల్లే అస్వస్థతకు గురైనట్లు ఎక్సైజ్ అధికారులు నిర్ధరించారు.

## భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొం టున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్ జెన్ హైరైజ్ బిల్డింగ్స్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్పారు. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200పైగానే ఉన్నాయని, మరో 250 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో కలిసి పని చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు హామీ ఇచ్చారు.

## తెలంగాణలో మహిళా సంఘాలకు రూ.344 కోట్లు విడుదల



హైదరాబాద్: తెలంగాణలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సెర్ప్‌కు ఆర్థిక శాఖ రూ.344 కోట్లు విడుదల చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. జులై 12 నుంచి 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీలేని డబ్బులు జమ కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



## మనం హాలిడే ట్రిప్ కోసం విదేశాలకు రాలేదు: గౌతమ్ గంభీర్



విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయాన్ని కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరికీ కుటుంబాలు ముఖ్యమేనని... అయితే మనం విదేశాలకు వచ్చిన కారణం వేరని చెప్పారు. మనం హాలిడే ట్రిప్ కోసం విదేశాలకు రాలేదని... దేశం కోసం ఆడటానికి వచ్చామని అన్నారు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్ లో చాలా తక్కువ మందితో ఉండాల్సి ఉంటుందని... వారితో పని చేసి దేశం గర్వపడేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందని గంభీర్ చెప్పారు. కుటుంబానికి సమయం కేటాయించాల్సిందేనని... అయితే, దేశం కోసం ఆడేందుకు వచ్చినప్పుడు మన దృష్టి ఆటపైనే ఉండాలని అన్నారు. తన వరకైతే తనకు ఈ లక్ష్యమే ఎక్కువని చెప్పారు. మనకు ప్రతిరోజు పోరాటమేనని... దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఇది తప్పదని గంభీర్ అన్నారు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంటుందని... డ్రెస్సింగ్ రూమ్ కల్చర్ గురించి కూడా మాట్లాడుకోవచ్చని చెప్పారు. మన విజయాలలో కుటుంబాల పాత్ర ఎక్కువగా ఉంటుందని అన్నారు. చటేశ్వర్ పుజారాతో ముఖాముఖిలో గంభీర్ ఈ మేరకు తన అభిప్రాయాలను పంచుకున్నారు.

## నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్ చూసి ఆశ్చర్యపోయాను: అనిల్ కుంబ్లే

* **లార్డ్స్ టెస్టు తొలి రోజున ఆకట్టుకున్న నితీశ్ కుమార్ రెడ్డి**
* **ఒకే ఓవర్లో రెండు వికెట్లతో ఇంగ్లండ్ ను దెబ్బకొట్టిన తెలుగుతేజం**
* **అతడికి మరిన్ని అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలన్న కుంబ్లే**
* **ఒకవేళ విఫలమైనా నితీశ్ పై వేటు వేయొద్దని సూచన**

తెలుగుతేజం నితీశ్ కుమార్ రెడ్డి లార్డ్స్ టెస్టు తొలిరోజున ప్రభావంతమైన బౌలింగ్ తో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ లో టాస్ నెగ్గిన ఆతిథ్య ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకోగా... నితీశ్ కుమార్ రెడ్డి ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి ఇంగ్లండ్ ను దెబ్బకొట్టాడు. దీనిపై టీమిండియా బౌలింగ్ దిగ్గజం అనిల్ కుంబ్లే స్పందించాడు. నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్ తనను ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నాడు. సరైన ప్రదేశాల్లో బంతులు సంధించాడని కితాబిచ్చాడు. తొలి వికెట్ లెగ్ సైడ్ బంతితో ఏదో యాదృచ్ఛికంగా వచ్చినట్టు అనిపించినా, రెండో వికెట్ మాత్రం అద్భుతమైన బంతితో సాధించాడని



కుంబ్లే కొనియాడాడు. తొలి రోజు ఆటలో నితీశ్ కుమార్ రెడ్డితో 14 ఓవర్లే వేయించారని, కానీ ఇంకా మరికొన్ని ఓవర్లు వేసే ఉత్సాహం అతడిలో కనిపించిందని వివరించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో సెంచరీ చేసి బ్యాటింగ్ లో సత్తా చాటాడని, ఆ సిరీస్ లో మరిన్ని వికెట్లు తీయలేకపోయినా, బ్రేక్ ఇవ్వగల బౌలర్ అని నిరూపించుకున్నాడని కుంబ్లే స్పష్టం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్ లోనే కాకుండా, ఫీల్డింగ్ లోనూ చురుగ్గా కదిలే సామర్థ్యం నితీశ్ కుమార్ రెడ్డికి ఉందని అన్నాడు. అందుకే, నితీశ్ కుమార్ రెడ్డికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని, అతడిని జట్టు నుంచి తొలగించే పనులు చేయొద్దని కుంబ్లే హితవు పలికాడు. ఒకవేళ అతడు విఫలమైనా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి విషయంలో బీసీసీఐ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించాడు.

## ఆసియా కప్ 2025.. అక్కడి మీటింగ్‌కు మేం హాజరవ్వం: బీసీసీఐ, శ్రీలంక బోర్డు

బంగ్లాదేశ్‌తో భారత్ వన్డే, టీ20 సిరీస్‌లను బీసీసీఐ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ షెడ్యూల్ కఠినంగా ఉండటంతోనే వాయిదా వేసినట్లు పేర్కొంది. కానీ, బంగ్లాలో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆటగాళ్ల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా ఆసియా కప్ 2025 నిర్వహణ పైనా అనుమానాలు వస్తున్నాయి. ఈనెల చివరి వారంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఇందుకు వేదిక బంగ్లాదేశ్ రాజధాని ఢాకా. ఇప్పుడు ఇదే ప్రధాన సమస్యగా మారింది. ఇక్కడ జరగబోయే ఏసీసీ మీటింగ్‌కు తాము హాజరుకావడం లేదని ఇప్పటికే భారత్, శ్రీలంక దేశాలు సమాచారం ఇచ్చాయని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, షెడ్యూల్ ప్రకారం ఏసీసీ మీటింగ్ మాత్రం జరుగుతుందని పాక్ క్రికెట్ బోర్డు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. "ఇంకా రెండు వారాల సమయం ఉంది. అన్ని సభ్య దేశాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఎవరైనా ఢాకాకు రాకూడదని భావిస్తే.. వారు ఆన్‌లైన్ వేదికగా పాల్గొనే అవకాశం ఉంది. మీటింగ్ మాత్రం తప్పకుండా ఢాకాలోనే జరుగుతుంది. జులై 20 24 మధ్య బంగ్లా పాక్ జట్ల మధ్య మూడు టీ20ల సిరీస్ జరగనుంది.

## ఓటీటీలోకి 'కుబేర'.. అధికారికంగా ప్రకటించిన సంస్థ




శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది.

**కథేంటంటే:** దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్భ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్ లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జున)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడు? అన్నది మిగిలిన కథ.



”
వైష్ణవి చైతన్య తన ఫ్యాషన్ తో సంచలనాలు సృష్టిస్తోంది. అదే విధంగా ఆమె సరళమైన కానీ స్టైలిష్ టీ-షర్టును బోహేమియన్ ప్యాంటుతో జత చేసి కనిపిస్తుంది. చిత్రం యొక్క చీకటి మూడీ బ్యాక్‌డ్రాప్ ఆమె "వెలుగు మిమ్మల్ని కనుగొననివ్వండి" అనే శీర్షికను ఖచ్చితంగా గుర్తు చేస్తుంది.







రాను బొంబైకి రాను

## 40 కోట్ల వ్యూస్

తెలంగాణ జానపదం మకుటం లేని మహారాణిలా దూసుకుపోతోంది. మన మట్టి పరిమళాలు ఖండాంతరాలు దాటుతున్నాయి. పెదవులు పలికేలా.. కాలు కదిపేలా చేస్తున్నాయి. మన పల్లె వాతావరణం, కట్టు, బొట్టు రాకింగ్ లెవల్ లో దూసుకుపోతోంది. ఈ మధ్య కాలంలో ఈ పాటల్లో అతి పెద్ద సెన్సేషన్ అంటే.. రాను బొంబాయ్‌కి రాను. సింపుల్ ట్యూన్.. అంతే సింపుల్ కొరియోగ్రఫీ.. కానీ కావాల్సినంత ఊపు.. ఇంకేముంది ఈ పాట యూట్యూబ్‌లో మోత మోగించేసింది. విడుదలైన నాలుగు నెలల్లోనే ఈ పాటకు ఏకంగా 40 కోట్ల వ్యూస్ రావడం విశేషం. ఈ పాట ఎంత పాపులర్ అంటే.. హిందీ టీవీ షోల్లో సెలబ్రెటీలు సైతం దీనికి స్టెప్పులు వేశారు. దేశ విదేశాల్లో ఈ పాట తిరుగులేని పాపులారిటీ సంపాదించింది. ఇంత తక్కువ వ్యవధిలో ఈ స్థాయి రీచ్ సంపాదించిన ఈ పాట.. మున్ముందు ఇంకా ఎక్కడికో వెళ్లిపోవడం ఖాయం. దీని మీద ఆదాయం కొనసాగుతూనే ఉంటుంది. ఈ పాటను కళ్యాణ్ కీస్ అనే సంగీత దర్శకుడు ట్యూన్ చేయగా.. రాము రాథోడ్ లిరిక్స్ రాశాడు. రాముతో కలిసి ప్రభ అనే సింగర్ ఈ పాటను పాడింది.

## చిరు హ్యాపీ!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' కోసం ఫ్యాన్స్ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. అయితే, ఈ చిత్రానికి సంబంధించి ఎప్పుడు ఎలాంటి అప్డేట్ వచ్చినా మెగా అభిమానులు కచ్చితంగా ఫాలో అవుతున్నారు. తాజాగా వీఎఫ్ఎక్స్ వర్క్స్‌ను చిరు వీక్షించినట్లు తెలుస్తోంది. దాదాపు 45 నిమిషాల గ్రాఫిక్స్ వర్క్‌ను ఆయన చూశారట. ఇక ఈసారి ఔట్‌పుట్ విషయంలో ఆయన హ్యాపీగా ఉన్నారట. కాగా, ఈ చిత్రానికి సంబంధించిన మిగతా ప్యాచ్ వర్క్, సాంగ్ షూట్‌ను కూడా వీలైనంత త్వరగా ముగించాలని మేకర్స్‌కు సూచించారని టాక్. మౌని రాయ్ డాన్స్ చేయబోతున్న స్పెషల్ సాంగ్‌ని రీమిక్స్ కాకుండా భీమ్స్ కొత్త ట్యూన్ సిద్ధం చేసినట్లు వినికిడి. ఈ మెగా మూవీలో అందాల భామ త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఆశికా రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఎం.ఎం.కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నాడు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తోంది. కాగా.. సెప్టెంబర్ 18న 'విశ్వంభర' రిలీజ్ చేసేందుకు మూవీ టీం సన్నాహకాలు చేస్తున్నట్లు సమాచారం.

## రౌడీ సరసన కీర్తి



మహానటి కీర్తి సురేశ్ టాలీవుడ్ లో ఓ క్రేజీ ప్రాజెక్ట్ కు కమిట్ అయినట్టు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ నటించనున్న ఓ కొత్త సినిమాలో ఆమె పేరు వినిపిస్తోంది. కీర్తి సురేష్ గతేడాది డిసెంబర్‌లో తన చిరకాల స్నేహితుడు ఆంటోనీ తాటిల్‌ను పెళ్లి చేసుకుంది. అయితే పెళ్లి తర్వాత కీర్తి సినిమాలు చేస్తుందా? అనే అనుమానాలు ఉండేవి. కానీ కీర్తి మాత్రం వరుస సినిమాలతో దూసుకుపోతోంది. తాజాగా ఆమె నటించిన 'ఉప్పుకప్పురంబు' సినిమా డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ అయింది. ప్రస్తుతం తమిళ్‌లో కన్నివేడి, రివాల్వర్ రీటా సినిమాలతో బిజీగా ఉంది. అయితే.. కీర్తి ముందు నుంచి కూడా లిప్ లాక్ సీన్స్ చేయలేదు. ఇక పై కూడా అలాంటివి చేసే చాన్స్ లేదు. దీపిక పదుకొనే లాంటి స్టార్ హీరోయిన్లు పెళ్లైన తర్వాత రొమాన్స్, లిప్ లాక్స్, బికినీతో రెచ్చిపోయారు. కీర్తి మాత్రం అలాంటి వాటికి నో చెప్పేస్తోంది. అప్పటి వరకు గ్లామర్ గేట్స్ తెరవని కీర్తి సురేష్ మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమా నుంచి యూ టర్న్ తీసుకుంది. ఈ సినిమాలో కాస్త డోస్ పెంచి హీట్ పెంచేసింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బేబీజాన్ సినిమాలోను గ్లామర్ ట్రీట్ ఇచ్చింది. ఇంతకుమించి అమ్మడు చేసిన స్కిన్ షో తక్కువే. విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న ఈప్రాజెక్ట్ కోసం కీర్తి హద్దులు చెరిపేస్తుందా? అనే టాక్ నడుస్తోంది.





Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.